www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 7 అక్టోబరు 2024

సమస్యలు పరిష్కరించండి

నేడు కలెక్టర్‌కు అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం హామీలు ఇచ్చింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ మేరకు సమ్మె సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నేతల చర్చించారు. జీతాలు పెంపు, తదితర విషయాలపై సోమవారం కలెక్టర్‌ను కలసి వినతులు అందించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చింది. ఈ మేరకు కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రాలు అందించనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షకిల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

తండ్రిపై కోపంతో హత్య

- ఉత్కంఠతకు తెర..
- ఆర్థిక లావాదేవీలే కారణం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ

ప్రజాశక్తి- పుంగనూరు: గత నెల 29న అదృశ్యమైన అస్పియా అంజుమ్ (7) హత్య కేసులో నిందితులను గుర్తించినట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. పుంగనూరు అర్బన్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ ఆదివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. అస్పియా తండ్రి అజ్మతుల్లా వడ్డీ వ్యాపారం చేసేవాడు. వారింటికి వంద మీటర్ల దూరంలో ఓ మైనార్టీ కుటుంబానికి చెందిన తల్లి హసీనా, కుమార్తె రేష్మకు ఇంటి నిర్మాణానికి రూ .3.50 లక్షలు నగదును అప్పుగా ఇచ్చారు. తీసుకున్న నగదు గడువులోపు ఇవ్వకపోవడంతో అజ్మతుల్లా వారిని అసభ్య కరంగా మాట్లాడారు. దీంతో వారు మనస్తాపం చెంది వారి కుటుంబంపై కక్ష పెంచు కున్నారు. గతనెల 29న అస్పియా అంజుమ్ ఇంటి ముందు పిల్లలతో ఆడుకుంటుండగా హసీనా చిన్నారికి చాక్లెట్ ఇచ్చి వారింటికి తీసుకెళ్లింది. చిన్నారికి భోజనం పెట్టింది. చిన్నారి ఇంటికి వెళ్లాలని ఏడవడం, ఎంత చెప్పినా వినకుండా ఏడుస్తూనే ఉండటంతో హసీనా కుమార్తె రేష్మ, ఓ బాలుడినీ ఇంటి ముందు కాపలాగా పెట్టింది. అస్పియా ఏడుస్తూనే ఉండటంతో హసీనా చిన్నారి ముక్కు, నోరు గట్టిగా పట్టుకోవడంతో శ్వాశ ఆడక కొంతసేపటికే అస్పియా మృతి చెందింది. దీంతో హసీనా బాలుడి సాయంతో ద్విచక్రవాహనంలో అస్పియా మృతదేహాన్ని పెట్టుకుని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద నీళ్లలోకి విసిరేశారు. మూడు రోజుల తర్వాత మృతదేహం నీటిలో తేలింది. దీంతో అనుమాని తులుగా హసీనాను, సహకరించిన వారిని అదుపులోకి తీసుకుని విచారించగా చిన్నారి మృతి మిస్టరీ వీడిందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్పి సాయినాథ్ ప్రభాకర్, సిఐ శ్రీనివాసులు, ఎస్ బిసిఐ భాస్కర్ పాల్గొన్నారు.

మీడియా అత్యుత్సాహం పనికి రాదు: కలెక్టర్

అస్పియా అదృశ్యం కేసులో మీడియా అత్యుత్సాహం చూపి వక్రీకరించారని ఇలాంటివి సరికాదని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. వక్రీకరించి చూపించిన మీడియాపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని ప్రశ్నించారు. ఉన్న వాస్తవాలను సమాజం దృష్టికి తీసుకెళ్లాలి కానీ లేని వాటిని ఉన్నట్లు చూపడం మంచి పద్ధతి కాదన్నారు. వాస్తవాలను మాత్రమే రాయాలని హద్దు మీరు ప్రవర్తిస్తే చర్యలు ఉంటాయన్నారు. మైనర్లకు జరిగిన సంఘటనలను ప్రచురించేటప్పుడు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్‌పి మణికంఠ చందోలు

అత్యాచారం కాదు: వైద్యాధికారి

చిన్నారి హత్య జరిగిన తరువాత మూడు రోజుల అనంతరం జరిపిన పోస్టుమార్టంలో అత్యాచారం జరగలేదని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి మధుసూదనాచారి తెలిపారు. మృతదేహం మూడు రోజులు పాటు నీటిలో ఉండడంతో శరీరంలో మార్పు వచ్చి ఉబ్బి పోయిందన్నారు. ఐదుగురు వైద్యుల బృందం సమక్షంలో వీడియో కెమెరాలు మధ్య పోస్టుమార్టం నిర్వహించినట్లు చెప్పారు. శరీరంలో ఎక్కడ ఎలాంటి గాయాలు లేవన్నారు. ల్యాబ్ నుంచి పూర్తి రిపోర్టు వచ్చిన అనంతరం మరిన్ని వివరాలు తెలుస్తా యన్నారు.

నిమజ్జనానికి వెళ్లి బాలుడు మృతి

పజాశక్తి -చిత్తూరు అర్బన్: వినాయక నిమజ్జనానికి వెళ్లి చెరువులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన ఆదివారం నగరంలోని కట్టమంచి చెరువులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు నగరం లోని గుర్రప్ప నాయుడు వీధికి చెందిన ఆకాష్ (14) శ్రీకాంత్ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు తన నలుగురు స్నేహితులతో కలిసి కట్టమంచి చెరువులో వినాయక విగ్రహం నిమజ్జనానికి ఆదివారం సాయంత్రం వచ్చాడు. సరదాగా చెరువులో దిగడంతో ఊబిలో కూరుకు పోయాడు. ఊపిరాడక ఊబిలోకి వెళ్లిపోవడంతో ఇతర స్నేహితులు అతడిని కాపాడడానికి ఎంతగానో ప్రయత్నించారు. అయినా అతడిని సకాలంలో పైకి తీసుకురాలేకపోయారు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికుల సాయంతో ఊబిలో కూరుకుపోయిన ఆకాష్‌ని పైకి తీసి హుటాహుటిన చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆకాష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆకాష్ కుటుంబ సభ్యుల రోదన వర్ణనాతీతంగా మారింది. చిత్తూరు వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జనానికి వెళ్లి మృతి చెందిన ఆకాష్

టీటీడీ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల(అటానమస్), శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల (అటానమస్), శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల(అటానమస్), ఎస్వీ ప్రాచ్య(ఓరియంటల్) కళాశాల, ఎస్వీ సంగీత నృత్య కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఆయా కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు టీటీడీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇందుకోసం విద్యార్థులు అక్టోబరు 7 నుంచి 9వ తేదీ వరకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించింది. స్పాట్ అడ్మిషన్లు పొందిన వారికి హాస్టల్ వసతి, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు ఉండవని అందులో పేర్కొన్నారు.

మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు

కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: రెండు రోజుల క్రితం ఆన్‌లైన్‌బెట్టింగ్‌తో అప్పుల పాలైన ఓ కుటుంబంలోని సభ్యులు నలుగురు ఆత్మహత్యాయత్నం చేసుకుని ఆస్పత్రి పాలైన సంఘటన తెలిసిందే. ఈ ఘటనలో ఆదేరోజు కుటుంబ యజమాని నాగరాజు రెడ్డి మరణిం చారు. మరుసటి రోజు శనివారం భార్య జయంతి , కుమార్తె సునీతలు వేర్వేరు సమయాల్లో మరణించారు. వారి ముగ్గురు మృతదేహాలకు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. స్వగ్రామమైన గంగాధర నెల్లూరుకు ఆ ముగ్గురి మృత దేహాలు రావడంతో బంధువులు, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో గంగాధరనెల్లూరులో ఆదివారం శోకసంద్రంగా మారింది.

మరొకరు మృతి

మృతి చెందిన దినేష్(ఫైల్ ఫొటో)

బెట్టింగ్ యాప్‌తో అప్పుల పాలైన ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో మృతి చెందిన నాగరాజు రెడ్డి, అతని సతీమణి జయంతి, కుమార్తె సునీతకు అంత్యక్రియలు గంగాధర నెల్లూరులో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. వారి అంత్యక్రియలు పూర్తయిన తర్వాత కొద్ది సేపటికే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజు రెడ్డి కుమారుడు దినేష్ (23) మృతి చెందాడు. ఇతని మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఈ నెల7వ తేదీ సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం1 గంట వరకు కలెక్టరేట్ లోని నూతన సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో పాటు నియోజక వర్గ, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు..

మత సామరస్యాన్ని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం ఐక్యవేదిక నాయకులు

మైనార్టీలపై దాడులను ఎదుర్కొందాం

- హిందూ ముస్లింల ఐక్యతను చాటుదాం
- ముస్లిం ఐక్యవేదిక పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మైనార్టీలపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవడంతో పాటు హక్కులను కాపా డు కుంటూ హిందూ ముస్లిం ఐక్యతను చాటా లని ముస్లిం ఐక్యవేదిక నాయ కులు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక గాంధీ విగ్రహం నుండి ఉర్దూ షాదీమహల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జాఫర్ పులి మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చాక మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. 13 శాతం జనాభా ఉన్న ముస్లింలకు ఆర్థిక, సమాజిక హక్కుల సాధనతో పాటు రాజకీయ అధికారం కోసం ముస్లింలు ఒక్కటి కావాలని పిలుపు నిచ్చారు. వక్ఫ్‌బోర్డు ఆస్తుల విషయంలో కేంద్రం ముస్లింలకు అన్యాయం చేసేలా తీసుకొస్తున్న బిల్లును వ్యతిరేకించి కూటమి ప్రభుత్వం ముస్లింలకు అండగా నిలవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలను ఏకం చేసేందుకు ముస్లిం ఐక్యవేదిక కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ముస్లిం ఐక్యవేదిక అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్, ట్రెజరర్ సలావుద్దీన్, సెక్రెటరీ సయ్యద్ నూర్, ఉపాధ్యక్షుడు బాజీ, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు షౌకత్ బాయ్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ రషీద్, ప్రధాన కార్యదర్శి ఇనయతుల్లా, ఉపాధ్యక్షుడు రషీద్, అలియాస్ బుచ్చిబాబు, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఖలీముల్ల, జీడీ నెల్లూరు నియోజకవర్గం అధ్యక్షుడు నవాజ్, పూతలపట్టు నియోజకవర్గం అధ్యక్షుడు ఫిరోజ్‌లతో పాటు ముస్లిం పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు కూరగాయలు వితరణ

వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

కూరగాయల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పలమనేరు: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిత్యాన్నదాన కార్యక్రమానికి అవసరమైన కూరగాయలను పలమనేరుకు చెందిన పలువురు దాతలు ముందుకొచ్చి మూడు ప్రత్యేక వాహనాలలో తరలించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి వాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి 14 ఏళ్లుగా తిరుమల తిరుపతి దేవస్థానానికి 340 లోడ్ల కాయగూరలను వితరణగా అందించడం గొప్ప విషయం అన్నారు. పలమనేరుకు తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రత్యేక స్థానాన్ని నిలిపిన దాతలందరిని మనస్పూర్తిగా అభినందిస్తున్నానన్నారు. భవిష్యత్తులోనూ మరింత మంది దాతలు ముందుకొచ్చి ఆ స్వామి సేవలోపాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దాతలను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్ వి బాలాజీ, నాయకులు ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడు, మధన్, శ్రీధర్, బిఆర్‌సి కుమార్, కిరణ్, ఖాజా పీర్, చాంద్ బాషా, హనీఫ్, మాబాషా, అల్లాబక్షు పాల్గొన్నారు.

ముత్యపు పందిరిపై శ్రీమలయప్ప

ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన ఆదివారం ఉదయం శ్రీ మలయప్ప స్వామి సింహ వాహనంపై యోగనరసింహుడి అలంకారంలో, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై ఉభయదేవేరులతో దర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. వాహనసేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, హైకోర్టు జడ్జి జస్టిస్ బివిఎల్ఎన్ చక్రవర్తి, టీటీడీ ఈవో జె.శ్యామలరావు దంపతులు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి దంపతులు, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ సిబ్బందికి వస్త్ర బహుమానం

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న వాహనం బేరర్లు, మేళం సిబ్బంది శ్రీవారి ఆలయంలో విధులు నిర్వహించే పారిశుధ్య సిబ్బందికి ఆదివారం సేలంకు చెందిన మెక్కినేశ్వరి టెక్స్‌టైల్స్ అధినేత తంగదొరై దంపతులు వస్త్ర బహుమానం అందజేశారు. తిరుమల వైభవోత్సవ మండపంలో టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి చేతులమీదుగా వస్త్రాలను అందించారు.

కేరళ కళాకారుల నృత్య ప్రదర్శన

విజిలెన్స్‌కీ ఫిర్యాదు



తిరుమల లేపాక్షి పక్కన టీ షాపులో ఎమ్మార్పీ కంటే అధిక రేట్లు అమ్ముతున్నారంటూ ఓ భక్తుడు విజిలెన్స్‌కీ ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు ఎస్టేట్ ఆఫీసర్, ఏఈఓ, టాస్క్‌ఫోర్స్ అధికారులు షాపును మూయించారు. ఇదే కాకుండా ఈరోజు పిఎస్‌సిటు వద్ద ఏడు షాపులు, వరహాలస్వామి గెస్ట్‌హౌస్ ఏరియా వద్ద ఎనిమిది అనాతరైజడ్ హాకర్సను మూయించారు.

అన్న ప్రసాదంలో జెర్రీ పడిందన్న విషయం పూర్తిగా దుష్ప్రచారం

మాధవ నిలయంలోని అన్నప్రసాదంలో తాము తిన్న అన్నప్రసాదంలో జెర్రి కనబడిందని ఒక భక్తుడు చేసిన ఆరోపణలు వాస్తవదూరమని టీటీడీ విజ్ఞప్తి చేసింది. తిరుమల శ్రీవారి దర్శనార్ధం వేలాదిమంది భక్తులకు వడ్డించడానికి పెద్దమొత్తంలో టిటిడి వారు అన్నప్రసాదాలను తయారుచేస్తారు. అంత వేడిలో ఏమాత్రం చెక్కుచెదరకుండా ఒక జెర్రీ ఉందని సదరు భక్తుడు పేర్కొనటం ఆశ్చర్యకరం. ఒకవేళ పెరుగు అన్నాన్ని కలపాలంటే కూడా ముందుగా వేడి చేసిన అన్నాన్ని బాగా కలియపెట్టి తరువాత పెరుగు కలుపుతారు. అటువంటప్పుడు ఏమాత్రం రూపు చెదరకుండా జెర్రి ఉండటం అనేది ఇది పూర్తిగా కావాలని చేసిన చర్యగా భావించాల్సి వస్తుంది. దయచేసి భక్తులు ఇటువంటి సత్యదూర వార్తలను నమ్మకూడదని టీటీడీ తెలిపింది.

ఎల్లసముద్రం రోడ్డుకు మోక్షం ఎప్పుడో?

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని 'తిరుత్తణి రోడ్డు నుండి ఎల్లసముద్రం వరకు రోడ్డుకు మోక్షం లేదా?' అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంటు బ్యాంకు వారి ఆర్థిక సహకారంతో రూ.40 నిధులతో 0.62 కిలోమీటరు రోడ్డును రెండున్నర సంవత్సరాల క్రితం ప్రారంభించి కంకర పరిచారు. కానీ సంవత్సరాలు తరబడిన రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తి కాలేదని గ్రామస్తులు వాపోతున్నారు. మరమ్మతుల పేరుతో రోడ్డును నాశనం చేశారని, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్తికాని ఎల్లసముద్రం రోడ్డు

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన యుటిఎఫ్ చిత్తూరు జిల్లా జట్టు

రాష్ట్ర వాలీబాల్ పోటీలో జిల్లా టీమ్ విజయం

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: యుటిఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా సంబరాలు నెల 4,5,6 తేదీల్లో మూడు రోజులపాటు గుంటూరులో అత్యంత క్రీడా స్ఫూర్తితో ఉపాధ్యాయులకు నిర్వహించారు. 22 రకాల క్రీడలలో రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుండి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిత్తూరు జిల్లా నుండి వివిధ క్రీడాంశాలలో ప్రాతినిధ్యం వహించారు. వాలీబాల్‌లో బాలాజీ, సిరాజ్ అహమ్మద్, వేణుగోపాల్, ఏ బాలాజీ, లక్ష్మయ్య, అంజిబాబు, గురుప్రసాద్, పి బాలాజీ జట్టు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి గోల్డ్ మెడల్ సాధించింది. చిత్తూరు జిల్లాకు చెందిన జి దేవేంద్ర (జెడ్పీ ఉన్నత పాఠశాల, తీర్థం) 200 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, 100 మీటర్ల పరుగులో సిల్వర్ మెడల్ సాధించారు. వికోట మండలానికి చెందిన జి గజేంద్ర షటిల్ బ్యాడ్మింటన్‌లో కాంస్య పతకం, క్రికెట్‌లో క్వార్టర్ ఫైనల్స్ వరకు చేరుకున్నారు. గెలుపొందిన క్రీడాకారులకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు , యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కెఎస్–ఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి జివి రమణ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎన్ మణి గండన్, నాయకులు శశికుమార్, ఎంవి రమణ, వంశీకృష్ణ పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల విజేతలకు యుటిఎఫ్ జిల్లా శాఖ అభినందనలు తెలిపింది.

తపాలా శాఖ ప్రైవేటీకరణ చేయొద్దు

- ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: కేంద్ర ప్రభుత్వం తపాల వ్యవస్థను ప్రైవేటీకరణ చేయడానికి పూను కుందని ఈ చర్యలను తక్షణమే నిలిపి వేయాలని అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శులు బి.శ్రీధర్ బాబు, ఏఐపిఈయు గ్రూప్ సిసిహెచ్ విద్యాసాగర్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని నరసింహ తీర్థంరోడ్‌లోని ఆఫీసర్స్ క్లబ్లో తిరుపతి పోస్టల్ డివిజన్ అఖిలభారత తపాల ఉద్యోగుల సంఘం గ్రూప్ సిపోస్ట్ మ్యాన్, ఎంటిఎస్, ఎంఎంఎస్ ద్వైవార్షిక మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తపాల వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి పూనుకుందన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించి తపాల వ్యవస్థను నష్టాలు తీసుకునే వచ్చే విధంగా నిర్ణయాలు చేయడం తగదన్నారు. ఎనిమిదో వేతన ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కేంద్రం తీసుకువచ్చిన నూతన పెన్షన్ విధానం అవసరం లేదని తెలిపారు. తపాల ఉద్యోగులపై పనిభారం తగ్గించి టార్గెట్ల పేరుతో వేధించడం మానుకోవాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పోస్ట్‌మాన్ అండ్ ఎంటిఎస్ జనరల్ సెక్రెటరీ ఏ.అజీజ్, తిరుపతి సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.నర్సప్ప, ఐపిఓఎస్ చిత్తూరు పోస్టల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ బి.లక్ష్మణ పాల్గొన్నారు.

12 నుంచి కొత్త మద్యం షాపులు

- కొనసాగుతున్న టెండర్ల ప్రక్రియ
- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఈనెల 12వ తేది నుండి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ మేరకు కొత్త మద్యం దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు సాగించనున్నట్లు చిత్తూరు, తిరుపతి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ తెలిపారు. కొత్త మద్యం పాలసీ మేరకు మద్యం దుకాణాల కేటాయింపు కోసం ఈనెల 9వ తేది వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా టెండర్లు స్వీకరిస్తామని ఈనెల 11వ తేది చిత్తూరు జిల్లాకు సంబంధించిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టెండర్లను స్థానిక షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణ మండపంలో ప్రభుత్వ నిబంధనల మేరకు లాటరీ పద్ధతి ద్వారా షాపులు కేటాయిస్తామని, 12 వ తేది నుండి నూతన విధానంలో మద్యం అమ్మకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. నూతన మద్యం పాలసీపై 'ప్రజాశక్తి' ప్రత్యేక ఇంటర్వ్యూలో జిల్లా డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్ పలు విషయాలు వివరించారు.

ప్రజాశక్తి : జిల్లాలో ఎన్ని మద్యం షాపులు గుర్తించారు..?

డిప్యూటీ కమిషనర్: జిల్లాలో చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో 14, మున్సిపాటీల్లో 23, మండలాల పరిధిలో 67 మొత్తం 104 మద్యం షాపులను గుర్తించి టెండర్లు ఆహ్వానించాం..

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి : మద్యం షాపుల నామినేషన్ ఫీజులు ఎంత..?

డిప్యూటీ కమిషనర్: మద్యం షాపుల కోసం ఎవ్వరైనా టెండర్లు వేసి లాటరీ పద్ధతి ద్వారా షాపు లను దక్కించుకోవచ్చు. టెండర్ వేసేందుకు రూ.2 లక్షల రూపాయలు చెల్లించా ల్సి ఉంటుంది. షాపులు దక్కించుకున్న వారి నుండి నామినేషన్ ఫీజు జిల్లాలోని 104 షాపుల్లో 34 షాపులు రూ.55లక్షలు, 70 షాపులు 65 లక్షలు ఈ మొత్తాన్ని సంవత్సరంలో మూడు దఫాల్లో చెల్లించవచ్చని తెలిపారు. ఏడాదికి 10 శాతం చొప్పున పెంపు ఉంటుంది.

ప్రజాశక్తి : నూతన మద్యం పాలసీ ప్రకారం మద్యం దుకాణం ఎన్ని గంటల వరకు ఉంటుంది?

డిప్యూటీ కమిషనర్: నూతన మద్యం పాలసీ ప్రకారం ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయాలు చేపట్టాల్సి ఉంటుంది.

ప్రజాశక్తి : కల్లుగీత కుటుంబాలకు కేటాయింపులున్నాయా?

డిప్యూటీ కమిషనర్: ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కల్లుగీత కుటుంబాలకు మద్యం దుకాణాల కేటాయింపు ఉంటుంది. వీరికి కేటాయించే షాపులకు ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేస్తాం.

ప్రజాశక్తి : మద్యం దుకాణం కోసం టెండర్లు ఎలా వేయాలి?

డిప్యూటీ కమిషనర్: మద్యం దుకాణం కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకొనే అవకాశం వుంది. నేరుగా దరఖాస్తు చేసుకునే వారు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి పేరిట డిడిలు తీసి ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తు లు ఈనెల 11వ తేది కలెక్టర్, అధికారుల సమక్షంలో లాటరీ తీసి షాపులు కేటాయిస్తాం.

అల్లుకున్న నిర్లక్ష్యం!

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న చెట్టు తీగలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని 11 కెవి విద్యుత్ స్తంభానికి తీగలు దట్టంగా అల్లుకున్నాయి. మాంబేడు పంచాయతీలో ధర్మా చెరువు దగ్గర ఉన్న సబ్ స్టేషన్ నుంచి 11 కెవి విద్యుత్ సరఫరా పచ్చికాపల్లం వరకు వుంది. ఇది 24 గంటలూ సప్లై ఉంటుంది. ఆ వైర్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభానికి టికెఎం పురం జాతీయ రహదారి పక్కనే తీగలు దట్టంగా అల్లుకొని పైకి ఎగబాకాయి. ఎవరైనా అటువైపు వెళితే ప్రమాద వశాత్తు చేయి తగిలితే ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో ఏమో.. కరెంట్ సప్లై అయితే.. ఏదైనా ప్రమాదం సంభవిస్తే బాధ్యులు ఎవరో అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే ఇలా వుంటే విద్యుత్ అధికారులు కానీ.. సచివాలయ సిబ్బంది లెన్‌మ్యాన్ కాని, ఎవరూ స్పందించక అలానే చూస్తూ వెళ్లిపోతుంటారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇలా ఉంటే..పనితీరు ఎలా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చని.. గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం సంభవించకముందే ఈ తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

బెట్టింగ్ ఆన్‌లైన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలి : సిఐ

సిఐ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: ఆన్‌లైను బెట్టింగ్‌పై యువత అప్రమత్తంగా వుండాలని సిఐ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ఆయన విఏకరులతో మాట్లాడుతూ యువత ఈ బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడి భవిష్యత్తును , చదువును పాడు చేసుకోవడమే కాకుండా కుటుంబాలు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి తీసుకొస్తోందన్నారు. ఈ యాప్‌ల ద్వారా డబ్బులు పోగొట్టుకోవడమే తప్ప తిరిగి డబ్బులు వచ్చే అవకాశం ఉండదని ఇలాంటి జూదాలకు బానిస కాకూడదని ఆయన సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలపై జాగ్రత్త వహించాలన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి పరామర్శ

కానిస్టేబుల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలం సాయి శ్రీనివాస్ నగర్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ చలపతి కుటుంబీలను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆదివారం పరామర్శించారు. బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న చలపతి కొద్దిరోజుల క్రితం గుండె పోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం ఆయన శుభస్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై చలపతి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారి కుటుంబీకులను పరామర్శించి తన సంతాపంతో పాటు సానుభూతిని తెలిపారు. ఆయన వెంట టిడిపి నాయకులు బిఆర్‌సి కుమార్, బాస్ అధ్యక్షులు రూపేష్ పాల్గొన్నారు.

నేడే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి -కుప్పం టౌన్ : కుప్పం పట్టణం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కడా పీడీ వికాస్ మరమత్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నియోజకవర్గంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావచ్చునని తెలిపారు. ప్రజల నుండి అందిన అర్జీలను పరిశీలించి, వాటిని విచారించి, గడువులోపు పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా బహుజన సాహిత్య అకాడమీ వేడుకలు

ప్రజాశక్తి - కార్వేటినగరం : బహుజన సాహిత్య అకాడమీ 8వ నేషనల్ కాన్ఫరెన్స్ తిరుపతి సిపిఐభవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ రోహిత్ కిస్కు బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు అందుకున్నారు. ప్రతి సంవత్సరం జరిగే అవార్డుల పురస్కారం సందర్భంగా రోహిత్ కిస్కుకు బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. అనంతరం ఇండియన్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ప్రజలకు మరింత సేవలు చేయడానికి కృషి చేస్తానని, ఈ అవార్డు రావడం పట్ల బహుజన సాహిత్య అకాడమికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ జనరల్ సెక్రటరీ విష్ణు వర్ధన్, నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పిసి స్వామి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ షేక్ సందాని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెక్రటరీ వెంకటేశులు పాల్గొన్నారు.

పన్నూరు విద్యార్థుల ప్రతిభ

రోబోటిక్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రజాశక్తి -విజయపురం : విజయపురం మండలం పన్నూరు సబ్‌స్టేషన్ రెయిన్‌బో పాఠశాల విద్యార్థులు తమిళనాడు తిరుచ్చిలో జరిగిన రోబొటిక్ లీగ్ సీజన్-3లో తమ ప్రతిభ కనుపరిచారు. తమిళనాడు, తిరుచ్చిలో శనివారం రాత్రి రోబొటిక్ లీగ్ అసోషియేషన్ వారు అతిపెద్ద రోబొటిక్ పోటీలు నిర్వహించారు. ఈ రోబొటిక్ పోటీలో ఆంధ్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడులోని సుమారు 350 పాఠశాలకు చెందిన 5వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పన్నూరు సబ్‌స్టేషన్‌లో రెయిన్‌బో పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఐదు ఈవెంట్లలో పాల్గొని అన్నింటిలో ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్, విజయపురం వైస్ ఎంపీపీ మంజు బాలాజీ, ప్రిన్సిపాల్ సి ప్రసన్నకుమార్ విద్యార్థులను అభినందించారు.

బాల త్రిపుర సుందరిగా ముత్యాలమ్మ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలం లోని బొమ్మయపల్లి పంచాయతీ వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ,మండల కేంద్రంలోని ముత్యాలమ్మ దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బాల త్రిపుర సుందరి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం అందించిన పూర్వ విద్యార్థులు

ఆర్థిక సాయం

ప్రజాశక్తి -సదుం : కిడ్నీ బాధితుడికి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆర్థికసాయం అందించారు. సదుం మేజర్ పంచాయతీ పరిధిలోని బలిజి వీధికి చెందిన భూతం ఆంజనేయులు కుమారుడు మునిరాజా(40) మూడు నెలల క్రితం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తిరుపతి స్విమ్స్ లో పరీక్షలు నిర్వహించగా రెండు కిడ్నీలు పాడైనట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో డబ్బులు వెచ్చించి డయాలసిస్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేట్ పనులతో భార్య పిల్లను పోషించుకునే మునిరాజా కు రెండు కిడ్నీలు పాడవటం తో కుటుంబం దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాలు తెలుసుకొన్న 1993- 94 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు పెద్ద మనస్సుతో, సేవా భావంతో మునిరాజా వైద్య ఖర్చులకు రూ.44,500లను, నిత్యావసర సరుకులను ఆ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో నాగ శేషారెడ్డి, హేమలత, సిలార్, అబీద్, సాక్షి గిరి పాల్గొన్నారు.

గరుడోత్సవానికి తరలిన భక్తులు

ప్రజాశక్తి -సోమల: దసరా సందర్భంగా తిరుమల వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను తిలకించడానికి గరుడోత్సవానికి సోమల మండలం నుండి అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం ఉదయం నుండి తిరుమల కు పాదయాత్రగా తరలి వెళ్లారు. సోమల ఇరికిపెంట వడ్డిపల్లి గన్నా వారి పల్లి దిడ్డివారిపల్లి కరకమంద ఎస్ నడింపల్లి సూరయ్య గారి పల్లి తదితర గ్రామాల నుండి వేలాదిమంది ఆదివారం ఉదయం 6 గంటల నుండి గరుడోత్సవానికి పాదయాత్రగా తరలి వెళ్లారు.

'ఉపాధ్యాయులూ నిరంతర విద్యార్థులే'

సమావేశంలో పాల్గొన్న డైట్ కళాశాల పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -కార్వేటినగరం: ఉపాధ్యాయులు కూడా నిరంతర విద్యార్థులేనని డైట్ కళాశాల విశ్రాంతి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అన్నారు. జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) కార్వేటినగరంలో 1982-83 పూర్వ శిక్షణా ఉపాధ్యాయులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడు దశాబ్దాల అనంతరం ఒక్కచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనందానికి అవధులు లేకుండా పోయింది. 'ఎక్కడ ఏమి చేస్తున్నారు? మీ పిల్లలు ఏం చేస్తున్నారు?' అని పలుకరించుకుంటూ విద్యాభ్యాసంలో చేసిన తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కనిపించారు. అనంతరం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంతి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎందరో ఛాత్రోపాధ్యాయులను ఉపాధ్యాయులుగా మార్చిన ఘనత కార్వేటినగరం జిల్లా విద్యాశిక్షణా సంస్థకు మాత్రమే ఉందన్నారు. 1992లో శిక్షణ పొందిన ఛాత్రోపాధ్యాయులందరూ ఉపాధ్యాయులు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ క్రమంలో భాగంగా అధ్యాపకులు సురేష్‌బాబు దంపతులను పూర్వ విద్యార్థులు శాలువలు కప్పి, గజమాలలతో ఘనంగా సన్మానించారు. 1982-83 సంవత్సరంలో ఛాత్రోపాధ్యాయులుగా శిక్షణ పొంది అనారోగ్యంతో మృతి చెందిన పలువురికి శ్రద్ధాంజలి ఘటించారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన పది మంది పూర్వ విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉమాశంకర్, శాంతకుమారి, వివిధ జిల్లాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ పట్టాతో బాధ్యత పెరిగింది

జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావు

గ్రాడ్యుయేషన్స్ పట్టాలు అందుకుంటున్న సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: గ్రాడ్యుయేషన్ పట్టాతో విద్యార్థుల బాధ్యత మరింత పెరిగిందని జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు నగరంలోని ఇరువారం వద్ద ఉన్న బాల త్రిపుర సుందరి కళ్యాణ మండపంలో సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల గ్రాడ్యుయేషన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు పట్టా పొందడంతో పాటు వారి బాధ్యత కూడా మరింత పెరుగుతుందన్నారు. ఉన్నత చదువుతో పాటు ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధినేత కల్పన మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ దినోత్స వంలో పాల్గొన్నారన్నారు. సీతమ్స్ కళాశాలలో విద్యార్థులకు చదువుతోపాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడం హర్షణీయమన్నారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ రంగనాథం, ప్రిన్సిపల్ వెంకటాచలపతి, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి సహకరించండి

కుప్పం నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్

మంత్రిని కలిసిన కుప్పం నియోజకవర్గ మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం నియోజకవర్గ మైనార్టీల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌లను కుప్పం నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు కోరారు. ఇటీవల పుంగనూరులో ప్రాణాలు విడిచిన చిన్నారి అస్పియా కుటుంబీకులను పరామర్శించడానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రులతో పాటు ఎమ్మెల్యే మహ్మద్ షాజహాన్ బాషా లను కుప్పం నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులతోపాటు నాయకులు ఫైరోజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాధ్యత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి న్యాయం జరిగేలా చూస్తామని రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుప్పం నియోజక వర్గ మైనార్టీ అధ్యక్షులు మైనారిటీ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వీటిపై సాను కూలంగా స్పందించిన మంత్రులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి - వికోట : కుప్పం బిఆర్‌డి ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డా. సురేష్ బాబు ఆధ్వర్యంలో వికోట మండలంలోని చింతామకులపల్లి ఎంపీపీ స్కూలులో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి 400 మందికి పైగా వచ్చారని, వైద్యులు వారికి ఉచితంగా బిపి, సుగర్ వ్యాధి పరీక్షలు చేసి, మందులు పంపిణి చేశామని తెలిపారు. 70 మందికి పైగా రోగులకు మెరుగైన వైద్యసేవల కోసం ఆసుపత్రికి రెఫెర్ చేశామని తెలిపారు. ఈ శిబిరంలో బిఆర్‌డి ఆసుపత్రి ఛైర్మన్ డాక్టరు సురేష్ బాబు , సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టరు హరిత మండవ , డాక్టరు దేవేంద్ర, వికోట టిడిపి మండల ప్రసిడెంట్ రంగనాథ్ , క్లస్టర్ ఇన్‌ఛార్జి రాంబాబు , చింతమకులపల్లి మాజీ సర్పంచ్ సతీష్ బాబు , బంగారుబాబు ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు: ట్రాన్స్‌కో ఏఈ

ప్రచారం నిర్వహిస్తున్న విద్యుత్ శాఖాధికారులు

ప్రజాశక్తి -సోమల: రైతులు తమ పంట పొలాలను జంతువుల బారి నుండి రక్షించుకునేందుకు అక్రమ విద్యుత్ కంచెలను ఏర్పాటు చేసి మూగజీవాల ప్రాణాలు కోల్పోవడమే కాకుండా ఒక్కోసారి మనుషుల ప్రాణాలు కూడా పోయే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఎవరూ తమ పంట పొలాలకు విద్యుత్ కంచె ఏర్పాటు చేయవద్దని అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏఈ మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలలో వాహనం ద్వారా మైక్ ప్రచారం చేస్తూ ఎవరైనా రైతులు పంట పొలాలను రాత్రి వేళల్లో జంతువుల బారీ నుండి కాపాడుకునేందుకు అక్రమ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసినట్లు తెలిస్తే సమీప ప్రాంత రైతులు ట్రాన్స్ అధికారులకు తెలపాలని దీనివల్ల మూగజీవాల ప్రాణాలు కాపాడడమే కాకుండా మనుషుల ప్రాణాలు కూడా కాపాడినట్లు అవుతుందని మైకు ద్వారా ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జడ్‌పి ఛైర్మన్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి -వి కోట : చిత్తూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు ఆదివారం మండలంలో విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల పరిధిలోని దాసర్లపల్లి వద్ద నిర్మించిన నూతన పెట్రోల్ బంక్ ను వారు ప్రారంభించారు. అనంతరం పలమనేరు రోడ్ లో వినాయక ఎంటర్ప్రైజెస్ వారి ఎలక్ట్రానిక్ బైక్ షోరూం ను ప్రారంభించారు. అనంతరం నేర్నేపల్లి వద్ద నూతనంగా గ్రామస్తులు నిర్మిస్తున్న చౌడేశ్వరి అమ్మవారి దేవాలయ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలకు ఆలయ నిర్మాణ సంఘానికి పలు సూచనలు సలహాలు అందించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్రాష్ట్ర సరిహద్దు మండలమైన వీకోట దినదినాభివృద్ధి చెందుతోంద ని ప్రైవేటు భాగస్వామ్యంతో స్థానిక యువతకు మరిన్ని ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొందించే పనులకు శ్రీకారం చుట్టాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సలహా మండలి సభ్యులు గౌస్, బాల గురునాథ్, సురేంద్ర గౌడ్, కేశవరెడ్డి ,చిన్నన్న , హరి ప్రకాష్, పాల్గొన్నారు.



వికోటలో పర్యటిస్తున్న జడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు

ఎస్వీయూలో 'జక్కదొన' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- ఎస్‌వియు క్యాంపస్: సుప్రసిద్ధ రచయిత ఆర్‌సి కృష్ణస్వామిరాజు రచించిన జక్కదొన కథా సంపుటి పుస్తకావిష్కరణ సభ ఎస్వీయూలో ప్రాచ్య పరిశోధన సంస్థ (ఓఆర్ఐ) ఆధ్వర్యంలో సెనేట్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ పుస్తకాన్ని ఆవిష్కరించిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కేవీస్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ కృష్ణస్వామిరాజు తాను పుట్టి పెరిగిన చిత్తూరు జిల్లా సామాజిక మూలాలను అక్షర రూపంలో నిక్షిప్తం చేస్తున్న రచయిత కృష్ణస్వామిరాజు అని కొనియాడారు. మాటకంటే రాత గొప్పదని అనుభవాలను కథల రూపంలో సాహిత్యలోకానికి అందిస్తున్నటువంటి రచయితలు అభినందనీయులని అన్నారు. ఒక పాలనాధికారిగా తెలుగు భాష మాట్లాడడం, పాలనలో ఉపయోగించడం ఆనందాన్నిస్తుందని అన్నారు. ఎస్వీయూలో తాను ఇంజనీరింగ్ చదివిన రోజులను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమానికి ప్రాచ్య పరిశోధనా సంస్థ సంచాలకులు ఆచార్య పిసి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతినాయుడు, ప్రత్యేక అతిథిగా మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎలిజిబెత్ జయకుమారి, గరికపాటి రమేష్ బాబులు విచ్చేశారు. కార్యక్రమంలో సత్యనారా యణ రాజు, మల్లేశ్వరరావు, డాక్టర్ మౌని, దామోదర నాయుడు, రాజేశ్వరమ్మ, సుభాషిని, గోవిందరాజు, రచయితలు నాగరాజు, కిట్టన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -కుప్పం రూరల్ : ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రకారం కుప్పం నియోజకవర్గ పరిధిలో పది మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ నాగరాజా విలేకరులకు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కుప్పం పట్టణ పరిధిలో 5, గుడుపల్లి మండలంలో 1, శాంతిపురం మండలంలో 2, రామకుప్పం మండలంలో 2 షాపులకు అనుమతి ఇచ్చామని తెలిపారు. భారతీయ పౌరులు అందరూ మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, ఆసక్తి గలవారు ఆన్లైన్ ద్వారా ఈనెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపున దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక వ్యక్తి అపరిమితంగా దరఖాస్తులు సమర్పించవచ్చని, ఇందుకోసం 2 లక్షల రూపాయలు ధరావత్తు చెల్లించాలని సూచించారు. కుప్పం పట్టణం, శాంతిపురం, రామకుప్పం మండలాలలోని మద్యం షాపులకు సంవత్సరానికి 65 లక్షల రూపాయలు, గుడిపల్లి మండల పరిధిలో 55 లక్షల రూపాయలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఎక్సైజ్ సీఐ 9885399789, ఎస్సై 9441949568 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మోహన్ బాబు పాల్గొన్నారు.

కార్వేటినగరం: నూతన మద్యం షాపులకు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎక్సైజ్ సీ.ఐ సిరీషాదేవీ తెలిపారు. ఆధివారమ ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీ.ఐ మాట్లాడుతూ కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నూతన మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకునే వారు కార్వేటినగరం-3, శ్రీరంగరాజపురం-2, వెదురుకుప్పం-2, పాలసముద్రం-1 షాపులకు 9వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 11వ తేదీ ఉదయం 8 గంటలకు చిత్తూరు కో ఆపరేటీవ్ షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణ మండపం ఆవరణలో కలెక్టర్ చేతుల మీదుగా మద్యం షాపుల టెండర్లు ప్రారంభిస్తారని చెప్పారు. లాటరీలో షాపులు పొందిన వారు అదే రోజు మొత్తం నగదును చెల్లించి 12వ తేదీ నుంచి షాపులు ప్రారంభించుకోవచ్చన్నారు.

క్రైం న్యూస్

గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడి మృతి

మృతి చెందిన యెసఫ్

ప్రజాశక్తి -రామకుప్పం: మండల శివార్లలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల, పోలీసుల కథనం మేరకు..ఆదివారం ఉదయం గురుకుల పాఠశాలలో సెక్యూరిటీ సిబ్బంది పాఠశాలలోని పరిసరాలు, క్వార్టర్స్ లో పరిశీలిస్తుండగా క్వార్టర్స్ లో దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, ఇన్‌ఛార్జ్ ఎస్ఐ నరేష్, ఏఎస్ఐ రెడ్డి శేఖర్ సిబ్బందితో వెళ్లి తలుపులు బద్దలు కొట్టి చూడగా పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు యెసఫ్(55) మృతి చెందినట్లుగా గుర్తించారు. ఇటీవల దసరా సెలవులతో పాఠశాలలోని విద్యార్థులు స్వస్థలాలకు వెళ్లారు. కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజులు క్రితం శుక్రవారం రాత్రి క్వార్టర్స్ లో పడుకొని నిద్రించాడు. ఈ క్రమంలో ఉపాధ్యాయుడికి అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుందని తెలిపారు. ఫిట్స్ వచ్చినప్పుడు ఎవరూ లేకపోవడం వల్ల మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పాఠశాల ప్రిన్సిపాల్, మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామన్నారు. మృతుడిది కర్నూలు జిల్లా మిడుతూరు మండలం వాసి, అతనికి భార్య, కుమారుడు ఉన్నారని తెలిపారు.

కాంట్రాక్టు సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

జిల్లా సమగ్ర శిక్షణ ఔట్‌సోర్సింగ్ జేఏసీ ఛైర్మన్ కృష్ణమూర్తి

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: సమగ్ర శిక్షణలో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు మంజూరు చేయాలని జిల్లా సమగ్ర శిక్షణ ఔట్‌సోర్సింగ్ జేఏసీ ఛైర్మన్ కృష్ణమూర్తి కోరారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాల్లో దసరా పండుగ కైనా రెండు నెలల జీతాలనైనా చెల్లించాలని జిల్లా సమగ్ర శిక్షణా ఔట్ సోర్సింగ్ జేఏసీ ఛైర్మన్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. విద్యాశాఖకు సంబంధించిన సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అయిన ఎంఐఎస్‌కు, డేటా ఎంట్రీకి, సిఆర్‌ఎంటిలకు, పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్స్‌కు, మెసెంజర్‌కు, ఐఆర్పీలకు, డిపిఓ ఆఫీస్ సిబ్బందికి కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది రాష్ట్రంలో సుమారు 25 వేల మంది ఉన్నారని ఆగస్టు, సెప్టెంబర్ రెండు నెలల జీతాలు లేక చాలా ఆర్థిక ఇబ్బందులు పడు తున్నారు. పిల్లల ఫీజులు కట్టలేక అద్దెలు కట్టుకోలేక, పండగ పూట కూడా పస్తు లతో ఉన్నారని గడిచిన మిలాద్‌ఉన్‌నబి , వినాయక చవితి పండుగలు జరుపుకోని దుస్థితి నెలకొందన్నారు. దసరా పండుగ కైనా రెండు నెలల జీతాలను చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని చాలీచాలని జీతాలే అయినా ప్రతి నెలా చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు విల్వనాథం, ప్రకాష్, గిరి, ధన శేఖర్, దేవేంద్ర, దేవా స్వప్న , చందు, యమునా లతా, సురేఖ, రమేష్, నాగార్జున, చలపతి పాల్గొన్నారు.

కార్యకర్తలను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

మాజీ డిప్యూటీ సీఎం పర్యటన

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి వెదురుకుప్పంలో ఆదివారం పర్యటిం చారు. మండలం లో ని జిఎం పల్లి గ్రామంలో సాంబయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలు సుకున్న ఆయన కార్యకర్తలతో వెళ్లి ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో కార్వేటినగరం మండలం యర్రమరాజు పల్లిలో పి మాధవరెడ్డిని పరా మర్శించారు. ఈయనకు డిప్యూటీ సీఎంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో మాధవ రెడ్డి కుమారుడు నరేంద్ర, నాయకులు మాజీ సర్పంచ్ ధనంజయలురెడ్డి, మురగయ్య, బాబు, దొరస్వామి, వరాలు రెడ్డి, సుబ్రహ్మణ్యం, దామోదర్ రెడ్డి, లోకనాథ్ రెడ్డి, రాజారెడ్డి, గిరి, రామయ్య పాల్గొన్నారు.

గంగవరం: గంగవరం మండల వైసిపి కన్వీనర్ మోహన్ రెడ్డి ప్రమాద వశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ మోహన్‌రెడ్డిని కలిసి పరామ ర్శించారు. మోహన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరితగతిన కోలుకుని యధావిధిగా కార్యక్రమాల్లో పాల్గొంటారని వారికి మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి

కళాకారులకు నగదు అందజేత

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞం సందర్భంగా కళాకారులు నాటకాలు, కార్యక్రమాలు ప్రదర్శించినందుకు వారికి పుంగనూరు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆదివారం నగదు అందించారు. హరికథ కళాకారులకు, వీధి నాటక కళాకారులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపి నగదు పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో మహాభారత యజ్ఞం నిర్వహించడం ఎంతో హర్షించదగ్గ విషయమని చరిత్ర, పురాణాలు నేటి ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని కళాకారులను కూడా ఆర్థికంగా ఆదుకున్నట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హరికథ భాగవతారని గీత శ్రీ, తబలిస్టు డమరేశ్వర్, హార్మోనిస్ట్ సురేష్ బాబు, సోమల టిడిపి నాయకులు పాల మల్లికార్జున, మహాభారత యజ్ఞ నిర్వాహకులు శ్రీనివాసులు కళాకారులు పాల్గొన్నారు.

కూరగాయల అలంకరణలో మారెమ్మ

ప్రజాశక్తి -సోమల: దసరా మహోత్సవాల సందర్భంగా మండలంలోని ఆవుల పల్లె పంచాయతీ పత్రపల్లి గ్రామంలోని మారెమ్మ అమ్మవారికి భక్తులు కూరగాయల అలంకరణ చేసి పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. దసరా ప్రారంభం నుండి వివిధ అలంకరణలతో అమ్మవారి దర్శనం చేసుకుంటున్న భక్తులు ఆదివారం కూరగాయల అలంకరణతో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని అర్చకులు ఇచ్చిన తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు ఎస్‌విసి ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్లులో గెలుపొందిన 16 మంది విజేతలకు ఎస్‌విసిఆర్ కళాశాల సిపిడిసి సెక్రటరీ శ్రీపురం సీతారామయ్య బంగారు పతకాలను అందించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.